గౌరవ వేతనాలు ఎప్పుడిస్తారో!

- ఎంపీటీసీ సభ్యులు సమావేశాలకే పరిమితమా?
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం


పామర్రు మండల పరిషత్ కార్యాలయం

పామర్రు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులను విస్మరిస్తోందనే విమర్శలు వస్తున్నాయి. జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులను అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేయకపోవడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంత వరకు గౌరవ వేతనం కూడా మంజూరు చేయలేదు. కనీసం ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రాధాన్యం ఇవ్వనప్పటికీ, గౌరవ వేతనం కూడా ఇవ్వక పోవడంపై సభ్యులు మండిపడుతున్నారు. ఇదే సమయంలో ఎలాంటి హోదా లేనప్పటికీ టీడీపీ నాయకులకు అధికారులు ప్రాధాన్యం ఇస్తున్నారంటూ పలువురు ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేతనం కోసం ఎదురు చూపులు

పామర్రు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పామర్రు–16, పెదపారుపూడి–9, తోట్లవల్లూరు 11, మొవ్వ –15, పమిడిముక్కల 15 కలిపి మొత్తం 66 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా రూ.3 వేలను గౌరవ వేతనంగా ఇవ్వాల్సి ఉంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సక్రమంగానే గౌరవ వేతనం చెల్లించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం పూర్తయినప్పటికీ ఇప్పటి వరకు సభ్యులకు గౌరవ వేతనం చెల్లించలేదు. కనీసం ఆ అంశంపై దృష్టి సారించడం లేదు. ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటికే రెండు సార్లు బడ్జెట్ కేటాయింపులు జరిగినా ప్రజాప్రతినిధుల ఖాతాల్లో మాత్రం నగదు జమ కాకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

సర్వ సభ్య సమావేశాలకే పరిమితం

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఎంపీటీసీ సభ్యులు సర్వ సభ్య సమావేశాలకు మాత్రమే పరిమితమయ్యారు. సమావేశాలకు హాజరు కావడం మినహా ప్రజా సమస్యలు సభ దృష్టికి తీసుకొచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని సభ్యులు పేర్కొంటున్నారు. కనీసం ప్రభుత్వం అధికారిక కార్యక్రమాలకు సైతం ఆహ్వానించకపోవడం దారుణమని వాపోతున్నారు.

ఎంపీటీసీ సభ్యులంటే చులకన భావం



ప్రజలు ఎన్నుకున్న ఎంపీటీసీ సభ్యులంటే అధికార యంత్రాంగం చులకన భావంతో చూస్తోంది. అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించక పోవడం, పథకాల సమాచారం కూడా ఇవ్వక పోవడం వంటి చర్యలతో అవమానిస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదు.

– టి. శ్రీనివాసరావు, పామర్రు 3వ సెగ్మెంట్ ఎంపీటీసీ

ఆహ్వానించడం లేదు



కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఎంపీటీసీ సభ్యులను అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించడం లేదు. ప్రజలతో ఎన్నుకోబడిన మాకు కనీస సమాచారం కూడా ఇవ్వకుండా వివక్ష చూపుతున్నారు. కేవలం మమ్మల్ని సర్వసభ్య సమావేశాలకే పరిమితం చేస్తున్నారు.

– పి. రత్నకుమారి, ఎలకుర్రు ఎంపీటీసీ సభ్యురాలు

గౌరవ వేతనం మంజూరు చేయాలి



పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాన్ని మంజూరు చేయాలి. స్థానికంగా నిర్వహిస్తున్న అధికారిక కార్యక్రమాలకు మమ్మల్ని ఆహ్వానించడం లేదు. ప్రజాప్రతినిధులకు మీరు ఇచ్చే గౌరవం ఇదేనా? ఇప్పటికైన అధికారులు స్పందించి అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించాలి.

– కె. నాగమల్లేశ్వరరావు, కొమరవోలు ఎంపీటీసీ సభ్యుడు

ఉచిత మెగా దంత వైద్యశిబిరం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

గుడ్లవల్లేరు: ఖరీదైన దంత వైద్యాన్ని ఉచితంగా ప్రజలకు అందిస్తున్నట్లు గుంటూరు సిబార్ డెంటల్ వైద్య విభాగం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మన్నె ప్రకాష్, హెచ్ఓడీ డాక్టర్ కడియాల కృష్ణకిషోర్ తెలిపారు. మంగళవారం నుంచి జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా గుడ్లవల్లేరు మండలం సింగలూరు భాగ్య విదాత చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్, సరస్వతి దంపతుల ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మంగళ, బుధవారాలు రెండు రోజుల ఈ కార్యక్రమాన్ని గుంటూరు సిబార్ దంత వైద్య కళాశాల రజతోత్సవ వేడుకల్లో భాగంగా సింగలూరు బండారు బ్రహ్మారావు, సీతామహాలక్ష్మి మెమోరియల్ కమ్యూనిటీ హాల్లో చేపట్టారు. బుధవారం తీసి పెట్టుకునే పూర్తి పళ్ల సెట్లను మంగళవారం హాజరైన రోగులకు వైద్యులు అందిస్తారని డాక్టర్ బండారు చెప్పారు. గ్రామ కార్యదర్శి చాపరాల రాజేష్, గుడ్లవల్లేరు సాయి విద్యానికేతన్ అధినేత శింగంశెట్టి ఆదినారాయణ(చిన మాస్టారు), ఉద్దంటి శివనాగమల్లేశ్వరరావు, కోటా పైడేశ్వరరావు, మాచర్ల రమణయ్య, బిట్రా అర్జునరావు, దోనేపూడి ప్రసాద్, తుమ్మలచర్ల లక్ష్మణరావు, ఆకురాతి రాఘవయ్య పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం


తోట్లవల్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

తోట్లవల్లూరు: పరిసరాల పరిశుభ్రత పాటించటం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని తోట్లవల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న సూచించారు. జాతీయ డెంగీ నివారణ మాసోత్సవంలో భాగంగా తోట్లవల్లూరులో ఆరోగ్య సిబ్బంది మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఇంటి పరిసరాలలో దోమలు లేకుండా చూసుకోవాలని డాక్టర్ సాయిప్రసన్న తెలియజేశారు. ఇళ్ల చుట్టూ మురుగునీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. దోమల నుంచి రక్షణకు దోమతెరలు వినియోగించాలని తెలిపారు. దోమల నివారణ ద్వారా డెంగీ, మలేరియా జ్వరాలు రాకుండా నివారించవచ్చన్నారు. సీహెచ్ఓ పద్మావతి, హెల్త్ సూపర్‌వైజర్ అనిల్‌కుమార్, రోహిణి, ఏఎన్ఎంలు కిరణ్‌కుమారి, కమలాక్షి, నిర్మలమేరి, హెల్త్ అసిస్టెంట్ రత్నం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన వంగడాలు సాగు చేయాలి


కొరగుంటపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

ముదినేపల్లి రూరల్: డెల్టా ప్రాంత రైతులు నూతన వరి వంగడాలు సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఫణికుమార్ అన్నారు. మండలంలోని కొరగుంటపాలెం, పెదగొన్నూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి పరిశోధనలు చేసి పూర్తి స్థాయిలో సంతృప్తి చెందిన మీదట అధిక దిగుబడులను ఇచ్చే నూతన వరి వంగడాలను విడుదల చేశారన్నారు. ఇదే కోవలో మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం నుంచి నూతనంగా ఎంటీయూ 1224, 1262 రకాల విత్తనాలు విడుదల చేసినట్లు చెప్పారు. ఈ రకం విత్తనాలు స్థానిక పరిస్థితులకు సరిపోతాయని రైతులు వీటిని సాగుచేసి అధిక దిగుబడులు పొందాలని కోరారు. మండవల్లి సబ్‌డివిజన్ ఏడీఏ జి.వెంకటమణి మాట్లాడుతూ మండలంలో విత్తనాలు నేరుగా వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తున్నారని, ఇందుకు బదులుగా డ్రమ్‌సీడర్‌తో విత్తనాలు విత్తితే కలుపు నివారణకు అనుకూలంగా ఉంటుందన్నారు. మండల వ్యవసాయాధికారి వేణుమాధవ్ పాల్గొన్నారు.

'ఇచ్చిన హామీని అమలు చేయాలి'

గుడివాడరూరల్: భర్త పెన్షన్ తీసుకుంటూ చనిపోతే ఆ పెన్షన్‌ను భార్యకు ఇస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ప్రచార విభాగ అధ్యక్షుడు గంటా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ప్రచార సమయంలో సూపర్ సిక్స్ పేరిట ఇచ్చిన హామీల్లో ఇప్పటి వరకు 50 శాతం కూడా ప్రభుత్వం నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. అదేవిధంగా భర్త పెన్షన్ తీసుకుని చనిపోతే వెంటనే ఆ పెన్షన్‌ను భార్యకు ఇస్తామని చెప్పి ఏడాది గడిచినా ఇంత వరకు ఎక్కడా పెన్షన్ అందించిన దాఖలాలు లేవని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి భర్త పెన్షన్ తీసుకుంటూ చనిపోతే వెంటనే ఆ పెన్షన్‌ను భార్యకు అందజేయాలని వైఎస్సార్ సీపీ తరఫున డిమాండ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పార్వతీదేవికి సారె సమర్పణ

కైకలూరు: వికాస తరంగిణి ఆధ్వర్యంలో స్థానిక శ్రీమన్నారాయణ గోష్టి మహిళా సభ్యులు శ్యామలాంబ అమ్మవారి దేవస్థానంలో కొలువైన రామలింగేశ్వర పార్వతీ దేవికి ఆషాఢ సారెను మంగళవారం సమర్పించారు. ఆలయ ఈఓ వీఎన్‌కే శేఖర్ ఎదురు వెళ్లి మహిళా సభ్యులకు స్వాగతం పలికారు. శ్రీమన్నారాయణ గోష్టి అధ్యక్షురాలు చిట్టి హేమలత బృందం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఏటా కైకలూరులో పలు ఆలయాల అమ్మవార్లకు సారెను అందిస్తున్నామని ఆమె తెలిపారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటీ వీరభద్ర శర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు చేయించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి అనేక మంది భక్తులు ఆలయానికి చేరుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా నిత్యాన్నదాన ప్రసాదానికి సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈఓ ఆర్. గంగాశ్రీదేవి పర్యవేక్షించారు.

రేపటి నుంచి గోపవరం రైల్వే గేటు మూసివేత

కైకలూరు: రైలు పట్టాలు, రోడ్డు మరమ్మతుల నిమిత్తం మండవల్లి–కైకలూరు రైల్వే లైన్ కైకలూరు–కలిదిండి రూట్‌లో లెవెల్ క్రాసింగ్ (గోపవరం గేట్ నంబర్ 82)ను గురువారం నుంచి నాలుగు రోజులు మూసి వేస్తున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ ఎండీ అబ్దుల్ రహీం మంగళవారం తెలిపారు. ఈ నెల 3వ తేదీ ఉదయం 7 గంటల నుంచి 7వ తేదీ రాత్రి 7 గంటల వరకు గేటు మూసి వేస్తున్నామని పేర్కొన్నారు. వాహనదారులు, ప్రయాణికులు ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రతిఒక్కరూ వైద్యులను గౌరవించాలి


పామర్రు సీహెచ్‌సీలోని వైద్యులను సన్మానించిన కళాపీఠం సభ్యులు


ప్రముఖ చిన్న పిల్లలవైద్యులు సురేష్‌చంద్రారెడ్డి జయ దంపతులను సన్మానిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

పామర్రు: సమాజానికి ప్రాణదాతలైన వైద్యులను ప్రతిఒక్కరూ గౌరవించాలని పద్మశ్రీ ఘంటసాల–బాలు స్మారక సంగీత కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీకృష్ణ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా స్థానికంగా ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లోని వైద్యులను మంగళవారం సన్మానించారు. అనంతరం హెల్త్ సెంటర్లో పలు విభాగాల్లో నిష్ణాతులైన వైద్యులు టీ సూదేశ్‌బాబు, ఎ నాగేశ్వరరావు, పీవీఎస్ఎస్ మల్లికార్జునరావు, టీ నీలిమ, ఎస్‌దీప్తి, కె.రోషిని, కె కనకశ్రావణి, జి.అన్నపూర్ణను సత్కరించారు. కార్యక్రమంలో కళాపీఠం కార్యదర్శి నందిపాటి హేమంత్‌రెడ్డి, సభ్యులు కె.సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో..

స్థానిక ఎస్–2 హాస్పిటల్ అధినేత డాక్టర్ సింగం శివయ్యను వాసవీ క్లబ్, వాసవీ వనిత క్లబ్ సభ్యులు సన్మానించారు. అనంతరం జయ వైద్యశాల వైద్యులు సురేష్‌చంద్రారెడ్డి దంపతులను సన్మానించారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు ఘంటసాల త్రివిక్రమ సాయిరాం, కార్యదర్శి కె.వీరజనార్దనరావు, సభ్యులు తాళ్లూరి నరేష్, బొగ్గరపు సాయిబాబు పాల్గొన్నారు.


ముదినేపల్లిలో వైద్యులను సత్కరిస్తున్న ఫార్మసీ విద్యార్థులు

ఘనంగా డాక్టర్స్‌డే

ముదినేపల్లి రూరల్: సమాజంలో నిస్వార్థంగా సేవలు అందించే వైద్యులను గౌరవించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని పలువురు వైద్యులు పేర్కొన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ముదినేపల్లి విజయ ఫార్మసీ కళాశాల విద్యార్థులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులను ఆహ్వానించి సత్కరించారు. కళాశాల డైరెక్టర్ పూజ, ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యులు మనోజ్, వెంకట్రావు, దీప్తిని సత్కరించారు.

సమ్మెను విజయవంతం చేయండి


కలిదిండి వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద సీపీఎం నాయకులు

కలిదిండి(కైకలూరు): కార్మిక సంఘాలు ఈ నెల 9న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఆ సంఘ కలిదిండి మండల కార్యదర్శి జక్కుల మహేష్ పిలుపునిచ్చారు. స్థానిక మార్కెట్ యార్డ్‌లో మంగళవారం భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించారు. మహేష్ మాట్లాడుతూ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను తెచ్చిందన్నారు. కనీస వేతనం రూ.26,000 పెంపు, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరణ, ఈఎస్ఐ అమలు తదితర డిమాండ్లతో జరుగుతున్న సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహంకాళిరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు అక్బర్, పి.బాలాజీ, పి.రాజేష్, కె.శ్రీను, బి.సూరిబాబు, పి.రమేష్, జి.నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

• గుంతలమయం

ఆదమరిస్తే అంతే..


చెరువును తలపిస్తున్న కపిలేశ్వరపురం సెంటర్‌లోని రోడ్డు

వేసవికాలం వెళ్లి వర్షాకాలం వచ్చింది. మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లన్నీ గుంతలమయంగా ఉన్నాయి. కనీసం మరమ్మతులు కూడా చేపట్టలేదు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కొన్ని రోడ్లు చెరువుల్లా మారాయి. రాత్రి వేళల్లో వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

– పమిడిముక్కల


కృష్ణాపురం–ఐలూరు రోడ్డులో కూరుకుపోయిన లారీ


కృష్ణాపురం సెంటర్‌లో రోడ్డు దుస్థితి


చోరగుడి సెంటర్‌లో రోడ్డుపై గుంతలు

వృద్ధులకు దుప్పట్లు, బియ్యం పంపిణీ

కైకలూరు: కైకలూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో వృద్ధులు, వితంతువులకు దుప్పట్లు, బియ్యం మంగళవారం పంపిణీ చేశారు. విశ్వబ్రాహ్మణ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు తుపాకుల సోమాచారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

• పుడమితల్లికి పచ్చబొట్లు

తోట్లవల్లూరు మండలంలో వరినాట్లు ఊపందుకుంటున్నాయి. వరినారుమడులు అదనుకు రావటంతో అన్నదాతలు వరినాట్ల పనుల్లో బిజీగా ఉన్నారు. పొలాలను శుభ్రం చేయటం, గట్లు పటిష్టం చేయటం, నీటితో తడిపి దమ్ము చేయించటం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. పుడమితల్లికి పచ్చబొట్లు వేసినట్లుగా వరినాట్లు పూర్తయిన మాగాణి పొలాలు దర్శనమిస్తున్నాయి.

– తోట్లవల్లూరు


వరినారు తీత పనుల్లో కూలీలు


నాట్లు వేస్తున్న కూలీలు


పచ్చగా కళకళలాడుతున్న వరినారుమడి

క్లుప్తంగా

మండలాభివృద్ధికి విజయసారథి కృషి



గుడ్లవల్లేరు: మండలాభివృద్ధికి ఎంపీడీఓ టి.విజయసారథి కృషి చేశారని గుడ్లవల్లేరు ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవికుమార్ పేర్కొన్నారు. ఎంపీడీఓ విజయసారథి ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయన దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.లోకరాజు, మాజీ లయన్స్ చైర్మన్ పోలవరపు వెంకట్రావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జంగం మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలకు కౌన్సెలింగ్



గుడివాడరూరల్: వివిధ కళాశాల వద్ద విద్యార్థులను ద్విచక్ర వాహనాలతో భయభ్రాంతులకు గురి చేస్తున్న ఆకతాయిలను డ్రోన్ కెమెరాలతో వన్‌టౌన్ శక్తి టీం సభ్యులు అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చినట్లు వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. గుడివాడ డివిజన్‌లో డ్రోన్ కెమెరాలతో నిఘాను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పట్టణంలో కొంతమంది ఆకతాయిలు కళాశాలలు వదిలే సమయంలో విద్యార్థినులను భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. తమ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న శక్తిటీం సభ్యులతో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసి ఏడుగురు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం యువకుల తల్లిదండ్రులను పిలిపించి శక్తి టీం సభ్యులతో కలసి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ఆలయాల ఈఓగా కొండలరావు



ముదినేపల్లి రూరల్: మండలంలోని సింగరాయపాలెం లక్ష్మీనృసింహస్వామి, అమృతేశ్వరస్వామి ఆలయాల ఈఓగా ఆకుల కొండలరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అదేవిధంగా బావాజీ మఠం ఈఓగా కూడా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఈఓగా వ్యవహరించిన పీవై నాయుడు ఉద్యోగ విరమణ చేయడంతో కొండాలమ్మ ఆలయ ఈఓగా వ్యవహరిస్తున్న కొండలరావుకు బాధ్యతలు అప్పగించారు.

అర్హులందరికీ పింఛన్



పామర్రు: అర్హులందరికీ పింఛన్లు పంపిణీ చేయటమే లక్ష్యంగా పని చేస్తామని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. పామర్రులోని పలు ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, నాయకులు ప్రవీణ్‌చంద్ర, గణేష్, సుబ్రమణ్యం, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చివరి భూముల వరకు సాగునీరు అందిస్తాం

గుడ్లవల్లేరు: చివరి వ్యవసాయ భూముల వరకు సాగునీరు అందిస్తామని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. కౌతవరం ఇరిగేషన్ సబ్ డివిజన్ పరిధిలోని గుడ్లవల్లేరులో మంగళవారం లాకులను వదిలి సాగునీరును అందించి పూజలు చేశారు. కార్యక్రమంలో దీఈ శ్రీనివాసరావు, ఏఈ తులసి, శీరం ప్రసాద్, శలపాటి ప్రసాద్, లాకు సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



పామర్రు: ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న వీరాంజనేయస్వామి ఆలయంలో ఆషాఢ మాసం తొలి మంగళవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పూజలు నిర్వహించారు. తొలుత ఆలయంలో స్వామికి ఆవుపాలతో, పంచామృతాలతో ప్రత్యేకంగా అభిషేకాలను చేశారు. అనంతరం నాగవల్లీలతో శతనామ అష్టోత్తర పూజలు జరిపారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు అగ్నిహోత్రం దినకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సహాయకులుగా ఫణి, శర్మ వ్యవహరించారు. ఆలయ అధికారి ప్రసాద్ పాల్గొన్నారు.